క్లుప్తంగా

ఉన్నతస్థాయికి ఎదగాలి



ప్రశ్నపత్రాలు అందజేస్తున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

నారాయణఖేడ్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని డీఎస్పీ వెంకట్‌రెడ్డి అన్నారు. ఖేడ్ ఆచార్య జయశంకర్ డిగ్రీకళాశాలలో స్కాలర్‌షిప్ 'ప్రతిభ' పరీక్ష నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీఎస్పీ ప్రశ్నాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదవాలన్నారు. ఈ మధ్యే ఖేడ్ ప్రాంతానికి చెందిన సుమారు 200 మంది యువతీ యువకులు పోలీసు ఉద్యోగాల్లో ఎంపికయ్యారని గుర్తు చేశారు. ప్రతిభ పరీక్షలో తదుపరి కోర్సు పూర్తయ్యే వరకు ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థికి రూ.10 వేలు, ద్వితీయ ర్యాంకు విద్యార్థికి రూ. 5 వేలు అందజేస్తారన్నారు. కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఈజీఎస్ ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

జోగిపేట(అందోల్): జేఏసీ పిలుపుమేరకు జోగిపేటలోని ఈజీఎస్ ఉద్యోగులు బుధవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. పేస్కేలు అమలు చేయాలని, పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. నిరసన కార్యక్రమంలో ఉపాధిహామీ ఏపీఓ, టీఏలు, సీఓలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించండి



వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో తాము ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మండల ఉపాధిహామీ పథకం ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు చెల్లించాలని కోరుతూ బుధవారం ఎంపీడీఓ రాజశేఖర్ కొలాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ.. తమ విధులు నిర్వర్తించడంతో పాటు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన నాలుగు సంక్షేమ పథకాల్లో తమ పాత్ర పోషించామన్నారు. మూడు నెలలుగా జీతాలు రాకపోవడం వల్ల ఇంటి అద్దెలు, బస్సు చార్జీలు, పిల్లల చదువుల కోసం ఖర్చులు, కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోయారు. ప్రభుత్వం వెంటనే తమకు వేతనాలు చెల్లించాలని కోరారు.

ఈత మొక్కల పెంపకానికి ప్రాధాన్యం



రాయికోడ్‌లోని నర్సరీని పరిశీలించిన ఎంపీడీఓ

రాయికోడ్(అందోల్): నర్సరీల్లో ఈత మొక్కల పెంపకం తప్పనిసరని ఎంపీడీఓ ఎంఎం.షరీఫ్ అన్నారు. మట్టి నింపిన బ్యాగ్‌ల సంఖ్యను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో 31 నర్సరీల్లో 3 వేల మొక్కలు పెంచేందుకు పనులు ప్రారంభమయ్యాయన్నారు. ప్రతి నర్సరీలో 1,000 మొక్కల పెంపకం తప్పనిసరిగా ఉండేలా సిబ్బందికి సూచించామన్నారు. వచ్చే వానాకాలంలో మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం, పంచాయతీ కార్యదర్శి శివశంకర్, ఎఫ్ఏ యాదుల్, కూలీలు ఉన్నారు.

గద్దర్‌పై చౌకబారు వ్యాఖ్యలు తగవు

ఏఐటీయూసీ మండల కార్యదర్శి శంకరప్ప



సదాశివపేటలో మాట్లాడుతున్న శంకరప్ప

సదాశివపేట(సంగారెడ్డి): ప్రజాగాయకుడు గద్దర్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్, ఆంధ్రప్రదేశ్ బీజేపీ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి చేసిన చౌకబారు వ్యాఖ్యలు మానుకోవాలని ఏఐటీయూసీ మండల కార్యదర్శి శంకరప్ప హెచ్చరించారు. బుధవారం పట్టణ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమం కోసం పాటల రూపంలో ప్రజలను చైతన్యం చేసిన గద్దర్‌పై అర్థరహితంగా మాట్లాడటం ఏమిటని ప్రశ్నించారు. బీజేపీ నాయకులకు తెలంగాణ ప్రజలు గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, వీరేశం పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పూర్తయ్యేదెన్నడో..?

- నేటికీ పునాదికే పరిమితం
- ఎంఈఓ ఆఫీసులో కొనసాగింపు



పునాదిలోనే నిలిచిపోయిన అంగన్‌వాడీ సెంటర్

కంది(సంగారెడ్డి): మండల కేంద్రంలోని అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు పునాదిస్థాయిలోనే నిలిచిపోయాయి. పదేళ్ల క్రితం రూ.12 లక్షల అంచనా వ్యయంతో అంగన్‌వాడీ భవన నిర్మాణం పనులను అప్పటి ప్రజాప్రతినిధులు ఘనంగా ప్రారంభించారు. అయితే, బేస్మెంట్ లెవ ల్ వరకు నిర్మించి కాంట్రాక్టర్ పనులను ఆపేశాడు. దీంతో పాత కంది అంగన్‌వాడీ సెంటర్‌కు సొంత భవనం లేకుండా పోయింది. అప్పట్లో కొత్తగా ఏర్పడిన కంది మండలానికి ఏర్పాటు చేసిన ఎంఈఓ కార్యాలయంలోకి అంగన్‌వాడీని తరలించా రు. అప్పటి నుంచి భవన నిర్మాణం పనులు చేపట్టకపోవడంతో ఆ స్థలంలో చెట్లు పెరిగిపోయాయి. దీంతో పక్కనే ఉన్న పాఠశాల విద్యార్థులకు ఇబ్బంది కలుగకుండా ఆ స్థలం చుట్టూ పరదాలను ఏర్పా టు చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆగిపోయిన నిర్మాణ పనులను ప్రారంభించి పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు భద్రతలో డ్రైవర్ పాత్ర కీలకం

మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ విజయరావు



ఐక్యాంపును ప్రారంభించిన ఇన్‌స్పెక్టర్ విజయరావు

పటాన్‌చెరు టౌన్: రోడ్డు భద్రతలో డ్రైవర్ల పాత్ర ఎంతో కీలకమని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ విజయరావు అన్నారు. బుధవారం జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు చేయించారు. ఆయన మాట్లాడుతూ.. డ్రైవర్లు ఆరోగ్య పరీక్షలతో పాటు కంటి పరీక్ష ఏడాదికి ఒకసారి చేయించుకోవాలన్నారు. డ్రైవర్లు వాహనాలను నడుపుతున్నప్పుడు తప్పనిసరిగా సీట్ బెల్టు పెట్టుకొని నడపాలన్నారు. మద్యం సేవించి నడపడం, ఓవర్ స్పీడ్, రాంగ్ రూట్‌లో వాహనాలను నడిపి ఇతరులకు ఇబ్బందులు కలిగించొద్దని సూచించారు.

మద్యం తాగి బస్సు నడిపితే జైలుకే

పటాన్‌చెరు టౌన్: స్కూల్ బస్సుల డ్రైవర్లు మద్యం సేవించి బస్సును నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని పటాన్‌చెరు ట్రాఫిక్ ఎస్ఐ ఆంజనేయులు హెచ్చరించారు. బుధవారం జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా స్కూల్ బస్సుల డ్రైవర్లకు ప్రత్యేక డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ.. వివిధ ప్రైవేట్ విద్యా సంస్థల బస్సుల డ్రైవర్లకు డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించారు. మద్యం సేవించి స్కూల్ బస్సులు నడిపితే జైలుకు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణ బాధ్యత

సంగారెడ్డి క్రైమ్: ప్రమాదాల నివారణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని పట్టణ సబ్ ఇన్‌స్పెక్టర్ సర్దార్ అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. సర్దార్ మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠశాలకు వచ్చే సమయాల్లో ప్రతి ఒక్క విద్యార్థి ట్రాఫిక్ సిగ్నల్స్‌ని గమనిస్తూ రోడ్డు దాటాలని సూచించారు. అతివేగం, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం కారణంగానే ఏటా ప్రమాదాలు ఎక్కువవుతున్నాయని సంగారెడ్డి షీ టీం ప్రత్యేక అధికారి ప్రవీణ్‌రెడ్డి తెలిపారు.



రెవెన్యూ ఆఫీసు ఎదుట బైఠాయించిన గ్రామస్తులు

ప్రభుత్వ భూములకు రక్షణ కరువు

జిన్నారం (పటాన్‌చెరు): ప్రభుత్వ భూములను పరిరక్షించాలని జిన్నారం గ్రామస్తులు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మండల కేంద్రంలోని సర్వే నంబర్ 58లోని భూమి ఆక్రమణకు గురవుతుందని గ్రామస్తులు తహసీల్దార్‌కు పలుమార్లు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై సంగారెడ్డి ఆర్డీఓ, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కూడా ఫిర్యాదులు చేశారు. దీంతో విచారణ జరిపి సర్వే చేయాలని జిన్నారం తహసీల్దార్ భిక్షపతిని ఉన్నతాధికారులు ఆదేశించారు. అయినా సర్వే చేయకుండా కాలయాపన చేస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం ధోరణి వీడి సర్వే నిర్వహించి ప్రభుత్వ భూములను కాపాడాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్, రాజేందర్ రెడ్డి, నర్సింలు, శంకరయ్య, యాదగిరి పాల్గొన్నారు.

దరఖాస్తుకు ఆహ్వానం

మునిపల్లి(అందోల్): మోడల్ స్కూల్ గరల్స్ హాస్టల్‌లో ఏఎన్ఎం పోస్టు ఖాళీగా ఉందని ఆసక్తి గలవారు ఈ నెల 30 సాయంత్రం వరకు దరఖాస్తు చేసుకోవాలని తాటిపల్లి కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ కవిత బుధవారం ప్రకటనలో కోరారు. ఇంటర్మీడియట్, ఏఎన్ఎం కోర్స్ పూర్తి చేసి ఉండాలన్నారు. ఎంపికైన ఏఎన్ఎంకు రూ. 7.800 వేతనం ఉంటుందన్నారు. సమాచారం కోసం 9912289410ను సంప్రదించాలన్నారు.

విద్యుత్ సమస్య తలెత్తకుండా చూడాలి

ట్రాన్స్‌కో ప్రాజెక్టు ఇన్‌చార్జి డైరెక్టర్ నందకిషోర్



సబ్‌స్టేషన్ వివరాలు తెలుసుకుంటున్న నందకిషోర్

సంగారెడ్డి: రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని ఎలాంటి విద్యుత్ అంతరాయం లేకుండా వేసవి యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని ట్రాన్స్‌కో ఇన్‌చార్జి డైరెక్టర్ నందకిషోర్ అధికారులకు ఆదేశించారు. బుధవారం జిల్లాలోని పలు సబ్ స్టేషన్‌లను ఆయన సందర్శించారు. అనంతరం విద్యుత్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్‌పై అధికారులు అప్రమత్తంగా ఉంటూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఈ శ్రీనాథ్, డీఈలు సురేందర్ రెడ్డి, శరత్ చంద్ర, ఏడీలు లక్ష్మణ్, ఏఈలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

'స్వయం ఉపాధి'కి దరఖాసులు ఆహ్వానం

జిన్నారం (పటాన్‌చెరు): దివ్యాంగులకు ఉపాధి, పునరావాసం కోసం ప్రభుత్వం సంక్షేమశాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు స్వయం ఉపాధి పథకం ప్రవేశపెట్టిందని గుమ్మడిదల మండల ఎంపీడీఓ ఉమాదేవి అన్నారు. సమాజంలో ఎలాంటి వివక్షకు తావు లేకుండా, అందరితో సమానంగా జీవించాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని అమలు చేస్తుందన్నారు. ఈ పథకం 2024–25 సంవత్సరం యూనిట్ విలువ రూ.50 వేల చొప్పున మొత్తం 34 యూనిట్లు కేటాయించారు. అర్హులైన దివ్యాంగులు 23వ తేదీ నుంచి వచ్చే నెల 02వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. దరఖాస్తులతో పాటు ధ్రువీకరణ పత్రాలు జాతచేసి స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకుని మంజూరు కాని వారు మళ్లీ దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉందని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

డిస్టెన్స్ సర్టిఫికెట్ జారీ చేయాలని వినతి



ఏఈకు వినతిపత్రం ఇస్తున్న పీఆర్టీయూ నాయకులు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ మున్సిపల్ పరిధి పెరిగినందున హెచ్ఆర్ఏ కోసం డిస్టెన్స్ సర్టిఫికెట్ జారీ చేయాలని పీఆర్టీయూ నాయకులు ఆర్అండ్‌బీ ఏఈ సంధ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు తులసీరాం రాథోడ్ మాట్లాడుతూ.. జహీరాబాద్ మున్సిపల్ పరిధిని ఇటీవల పెంచారు. పట్టణానికి 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయ, ఇతర ఉద్యోగులకు 13 శాతం హెచ్ఆర్ఏ రావాల్సి ఉందన్నారు. ఆర్అండ్‌బీ అధికారులు డిస్టెన్స్ సర్టిఫికెట్ జారీతో పాటు హెచ్ఆర్ఏ పొందడానికి వీలుందన్నారు. కావునా డిస్టెన్స్ సర్టిఫికెట్ జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు శ్రీశైలం, తుకారం, అశోక్, శ్రీనివాస్, ఆనంద్, దశ్‌సింగ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భక్తుల సందడి



ఝరాసంగం: కేతకీలో పూజలు అందుకుంటున్న పార్వతీపరమేశ్వరులు

మౌని అమావాస్యను పురస్కరించుకొని బుధవారం జిల్లాలోని ఆయా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా అర్చకులు పార్వతీపారమేశ్వరులకు అభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి, వాహనపూజ తరతర పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతర భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు.



పటాన్‌చెరు టౌన్ : ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు



ఝరాసంగం: క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తజనం



సంగారెడ్డి టౌన్: అన్నదానం చేస్తున్న శివస్వాములు

సంక్షిప్త వార్తలు

◆ సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ఝరాసంగం(జహీరాబాద్): ప్రభుత్వం నాలుగు పథకాల అమలులో భాగంగా ఝరాసంగం మండలంలోని బర్దిపూర్ గ్రామాన్ని ఎంపిక చేసి అమలు చేయడంతో రైతులు, ఉపాధి కూలీలు సంబురాలు నిర్వహించారు. సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీలకు ఆత్మీయ భరోసా ద్వారా 77 మంది ఎంపిక కాగా వారి ఖాతాల్లో రూ. 6 వేల చొప్పున నగదు జమ చేశారు. అలాగే, 592 మంది రైతులకు రైతు భరోసా నిధులు రు.67 లక్షలు జమ చేశారు. 303 ఇందిరమ్మ గృహాలు, రేషన్ కార్డులు మంజూరయ్యాయని తెలిపారు. బర్దిపూర్ గ్రామాన్ని ఎంపిక చేయడంపై మంత్రి దామోదర రాజనర్సింహ, టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్ రావు పాటిల్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

◆ హాస్టల్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలి

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని మోడల్ స్కూల్, కళాశాలకు చెందిన బాలికల హాస్టల్ నిర్వహణకు సంబంధించిన ఖాళీ పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని కేజీబీవీ ప్రత్యేక అధికారి దీపిక బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హాస్టల్ కేర్ టేకర్, వాచ్‌మెన్, ముగ్గురు వంట మనుషులు, అటెండర్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు చెప్పారు. ఆయా పోస్టులకు 18 నుంచి 45 ఏళ్ల వయస్సు ఉండి పదో తరగతి, ఏడవ తరగతి విద్యార్హత, అనుభవం ఉన్న మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు కేజీ బీవీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

◆ మొక్కల పెంపకాన్ని వేగవంతం చేయండి

కంగ్టి(నారాయణఖేడ్): వన నర్సరీల్లో మొక్కల పెంపకాన్ని పనులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ సత్తయ్య ఆదేశించారు. మండలంలోని తడ్కల్ గ్రామ శివారులోని నర్సరీని బుధవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. నర్సరీలోని ప్యాకెట్లలో మట్టి నింపడాన్ని పరిశీలించి త్వరగా విత్తనాలు విత్తి మొక్కలను పెంచాలని సూచించారు. మండలంలోని అన్నీ పంచాయతీల్లో మొక్కల పెంపకం వేగవంతం అయ్యేలా పంచాయతీ సెక్రటరీలు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సెక్రటరీ శ్రీనివాస్‌రావు, టీఏ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ మైత్రి ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదలలో మైత్రి ఫౌండేషన్ చేపడుతున్న సామాజిక సేవలు అభినందనీయమని మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ జయప్రకాష్ నారాయణ ప్రశంసించారు. బుధవారం ట్రస్ట్ చైర్మన్ చన్నం శెట్టి ఉదయ్‌కుమార్ నగరంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడుతూ.. యువత స్వచ్ఛందగా ముందుకు వచ్చి సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు నవీన్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

◆ 'మండల పరిషత్' కు భవనం గుర్తింపు

నారాయణఖేడ్: మండల పరిషత్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు ఖాళీగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని అధికారులు గుర్తించారు. కల్హేర్ మండలంలోని 11, ఖేడ్ మండంలోని ఆరు, పెద్దశంకరంపేట మండలంలోని ఒక పంచాయతీలను కలిపి 18 పంచాయతీలతో మండలాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు మండల కేంద్రంలో తహశీల్ కార్యాలయాన్ని మాత్రమే ఏర్పాటు చేశారు. తాజాగా మండల పరిషత్ ఇన్‌చార్జి ఎంపీడీఓగా కల్హేర్ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సంగ్రాం, జూనియర్ అసిస్టెంట్, ఇద్దరు సబార్డినేట్లను నియమించారు. రెండు రోజుల్లో మండల పరిషత్ కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు.

◆ గద్దర్‌పై బండి వ్యాఖ్యలు సరికాదు

నారాయణఖేడ్: ప్రజాగాయకుడు గద్దర్‌పై కేంద్రసహాయ మంత్రి బండిసంజయ్ వ్యాఖ్యలు సరికాదని అంబేడ్కర్ యువజన సంఘం ఖేడ్ నియోజకవర్గ అధ్యక్షుడు గణపతి, ఉపాధ్యక్షుడు బస్వరాజ్ డిమాండ్‌చేశారు. బుధవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ.. ఒంట్లో బుల్లెట్లు ఉన్నా గద్దర్ తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడారని గుర్తు చేశారు. ప్రధాని నరేంద్రమోదీ సైతం ఆయనకు లేఖ రాశారని గుర్తుచేశారు.

సీపీఆర్‌పై అవగాహన కల్గిండాలి

డాక్టర్ సయ్యద్ రేష్మి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు

పటాన్‌చెరు టౌన్: ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన కల్గిండాలని డాక్టర్ సయ్యద్ రేష్మి అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యక్తి అకస్మాత్తుగా అనారోగ్యానికి గురై గుండెపోటు వచ్చినప్పుడు ఐదు ఆరు సెకండ్లలోపు హై క్వాలిటీ సీపీఆర్ చేసినట్లయితే రోగిని రక్షించవచ్చని తెలిపారు. యువత చిన్న వయసులోనే గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి వ్యాధులకు గురవుతున్నారని చెప్పారు. దానికి కారణం మారుతున్న జీవన విధానాలు, ఆహారపు అలవాట్లు, వ్యాయామం లేకపోవడమేనని అన్నారు. అనంతరం సీపీఆర్ చేసే విధానాన్ని విద్యార్థులచే ప్రాక్టీస్ చేయించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, హెల్త్ క్లబ్ సమన్వయకర్త డాక్టర్ శివదీప్తి, ప్రవీణ్, డాక్టర్ సురేష్, డాక్టర్ రమణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాపీమేస్త్రీలకు అవగాహన



బీమా పత్రాలు అందజేస్తున్న శ్రీకాంత్

నారాయణఖేడ్: ఇళ్లు, ఇతరత్రా నిర్మాణాల్లో మేస్త్రీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిర్గాపూర్ మండల కేంద్రంలో బుధవారం భారతి సిమెంట్ సబ్ డీలర్ సాయి దుర్గా ట్రేడర్స్ ఆధ్వర్యంలో తాపీ మేస్త్రీలకు అవగాహన కల్పించారు. వికాట్ గ్రూపునకు చెందిన భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్‌ను తెలంగాణలో విడుదల చేసింది. వికాట్ గ్రూప్ కంపెనీలు ప్రపంచంలో 12దేశాల్లో విస్తరించి ఉన్నాయని సంస్థ సీనియర్ టెక్నికల్ సర్వీసెస్ వి.శ్రీకాంత్ తెలిపారు. భారతి సిమెంట్ స్లాబ్‌లు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరియైన ఎంపికన్నారు. సిమెంట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామని స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజనీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయ పడతారని తెలిపారు. ఇంటి నిర్మాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి క్లుప్తంగా వివరించారు. సమావేశంలో పాల్గొన్న మేస్త్రీలందరికీ రూ.లక్ష ప్రమాద బీమా పత్రాలు అందజేశారు. సమావేశంలో న్యూసప్తగిరి ట్రేడర్స్ డీలర్ దత్తు, సబ్‌డీలర్ అశోక్, బాలాగౌడ్, తాపీమేస్త్రీ పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారుల సూచనలు తప్పనిసరి



రైతులకు అవగాహన కల్పిస్తున్న నూతన్‌కుమార్

నారాయణఖేడ్: రైతులు పంటసాగు, యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల విషయంలో వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని ఏడీఏ నూతన్‌కుమార్ సూచించారు. బుధవారం ఆయన మండలంలోని తుర్కాపల్లి శివారులోని వరి పొలాలను పరిశీలించారు. ఈసందర్భంగా రైతులతో మాట్లాడుతూ.. వ్యవసాయ అధికారుల సూచనలు పా టిస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు పొందవచ్చన్నారు. వరికి కాండం తొలుచుపురుగు ఆశించినట్లు గుర్తించారు. సూచనల్లో భాగంగా పొలాల్లో నీరు పలుచగా ఉండేలా, నీరు పారిస్తూ, ఆరబెడుతూ ఉండాలన్నారు. తెగుళ్లు ఉన్నప్పుడు యూరియా వేయవద్దని సూచించారు. కాండం తొలుచుపురుగు నివారణ చర్యల్లో పిచికారీ చేయాల్సిన మందులు, మోతాదులను గురించి సమగ్రంగా వివరించారు.

మందుబాబులకు జైలు

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా, జైలు శిక్ష విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో 12 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని బుధవారం కోర్టులో హాజరుపరచగా ఐదుగురికి రూ.1500, ముగ్గరికి రూ. 1000, నలుగురికి జరిమానాతో పాటు రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి..

సంగారెడ్డి క్రైమ్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు జిల్లా కోర్టు జరిమానా, జైలుశిక్ష విధించిన సంఘటన సంగారెడ్డి పట్టణ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ సుమన్‌కుమార్ కథనం ప్రకారం.. మంగళవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో తనిఖీల్లో నాలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని బుధవారం జిల్లా కోర్టులో హాజరుపరచగా జిల్లా అదనపు న్యాయమూర్తి ఒకరికి మూడు రోజులు జైలు శిక్ష, ఇద్దరికి రూ.2000, ఒకరికి రూ. 1500 చొప్పున జరిమానా విధించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని నిరసన



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న సిబ్బంది

జహీరాబాద్ టౌన్: పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఉపాధి హామీ ఉద్యోగులు బుధవారం నిరసన తెలిపారు. ఈ మేరకు ఎంపీడీఓ మహేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. జేఏసీ నాయకులు అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. మూడు నెలల నుంచి జీతాలు లేక కుటుంబ పోషణ కష్టంగా ఉందన్నారు. ఉపాధిహామీ సిబ్బందిలో ఎక్కువ మంది నిరుపేదలు ఉన్నారని చెప్పారు. ప్రభుత్వం స్పందించి వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఏపీఓ, జేఈ, టెక్నికల్ అసిస్టెంట్ తదితరులు ఉన్నారు.

వేతనాలు అందజేయాలి

కంది(సంగారెడ్డి): మూడు నెలలుగా నిలిచిపోయిన వేతనాలను వెంటనే అందజేయాలని ఉపాధిహామీ ఏపీఓ గురుపాదం డిమాండ్ చేశారు. బుధవారం కంది ఎంపీడీఓ శ్రీనివాస్‌కు ఉపాధిహామీ సిబ్బంది వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత మూడు నెలలుగా తమకు వేతనాలు అందకపోవడంతో కుటుంబాలు గడవని దుస్థితి ఏర్పడిందన్నారు.